andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
మంగళవారం ఉష్ణోగ్రత గరిష్టం 30.5, కనిష్టం 22.7
నిర్మల్ జిల్లా వార్తలు
8
బుధవారం 23 అక్టోబరు 2024



ఘనంగా చండీ హోమం



కుంటాల, అక్టోబర్, 22 : (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఓలా గ్రామంలో మంగళవారం నవచండీ పారాయణ సహిత చండీహోమం, అయుష్షహోమం ఘనంగా నిర్వహించారు. ఓలా గ్రామానికి చెందిన గందే కలావతి 98వ పుట్టిన రోజు పురస్కరించుకొని శత సంవత్సర ఆయుశ్శాబివృద్ధి కలగాలని ఈ చండీహోమం కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆమె కుమారులు తెలిపారు. ఈ హోమం అశ్వయుజ కృష్ణ పక్ష చతుర్థి తేదీ 20 అక్టోబర్ ఆదివారం నుంచి 22వ వ తేదీ వరకు మంగళవారం వరకు నిర్వహించినట్లు వారు పేర్కొన్నారు.



రైస్‌మిల్‌లో నిల్వ ఉంచిన ధాన్యం సంచులు

రైస్‌మిల్లర్ల చేతివాటం

- గడువు ముగిసినా పెనాల్టీ బియ్యం ఊసేకరువు
- 38 వేల ఎంటీఎస్ బియ్యంపై స్పందన కరువు
- ఇంకా లక్ష37వేల ఎంటీఎస్‌ల సీఎంఆర్ బకాయి
- మొండిగా వ్యవహరిస్తున్న జిల్లాలోని 17 రైస్‌మిల్లుల యజమానులు
- అధికారుల తీరుపై అనుమానాలు

నిర్మల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సీఎంఆర్ బకాయి బియ్యం చెల్లింపు విషయంలో దోబూచులాట సాగుతోంది. రైస్‌మిల్లర్ల సిండికేట్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండడం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా సర్కారు ధనానికి భారీగా గండి పడుతోంది. గత మూడు నాలుగు నెలల నుంచి సీఎంఆర్ బియ్యం చెల్లింపు విషయంలో రైస్‌మిల్లుల యజమాన్యాలు పథకం ప్రకారం సర్కారును పక్కదోవ పట్టిస్తున్నట్లు ఫిర్యాదులున్నాయి. అంతా పథకం ప్రకారమే మిల్లింగ్ కెపాసిటీ అలాగే నిల్వ సామర్థ్యాన్ని తక్కువ చూపుతూ సీఎంఆర్‌కు గండి కొడుతున్నారన్న ఆరోపణలున్నాయి. మొదట 25 శాతం పెనాల్టీతో కూడిన సీఎంఆర్ బియ్యాన్ని గత నెల 30వ తేదీలోగా ఇవ్వాలని సర్కారు సీరియస్‌గా హెచ్చరించింది. అయితే ఆ గడువులోగా 17 రైస్‌మిల్లులు సీఎంఆర్ బియ్యాన్ని సర్కారుకు తిరిగి ఇవ్వలేదు. గడువు ముగిసి 20 రోజులు గడుస్తున్నప్పటికీ ఇప్పటి వరకు ఆ రైస్ మిల్లులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పట్ల భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 2022-2023 ఖరీఫ్‌సీజన్‌కు సంబంధించి మొత్తం 11,191 ఎంటీఎస్‌ల బియ్యాన్ని 17 రైస్‌మిల్లుల యజమానులకు సర్కారు ఇవ్వాల్సి ఉంది. అయితే తమకున్న రాజకీయ పలుకుబడి పరపతితో ఈ రైస్‌మిల్లుల యజమానులు సర్కారు హెచ్చరికలను బేఖాతరు చేస్తూనే ఉన్నారు. మొదటి నుంచి వీరు అధికారుల వార్నింగ్‌లను పట్టించుకోకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. అధికారులు కఠినచర్యలు తీసుకోకపోవడంతోనే ఈ రైస్‌మిల్లుల యజమానులు సీఎంఆర్ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు కూడా ఉన్నాయి. కాగా 2023-2024 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 38,764ఎంటీఎస్‌ల సీఎంఆర్ బియ్యాన్ని సర్కారుకు ఇవ్వాల్సి ఉంది. అలాగే రబీసీజన్‌కు సంబంధించి కూడా ఇంకా 94,419 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని ప్రభుత్వానికి రైస్‌మిల్లులు తిరిగి ఇవ్వాలి. అన్ని సీజన్‌లను కలుపుకొని దాదాపు 1లక్ష37వేల మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని ప్రభుత్వానికి ఇవ్వాల్సి ఉన్నప్పటికి రికవరీ విషయంలో సంబంధిత శాఖ అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోకపోవడం మిల్లుల యజమానులకు వరంగా మా రుతోందని అంటున్నారు. ముఖ్యంగా పర్యవేక్షణ లోపం, మరికొన్ని క్షేత్రస్థాయి కారణాల వల్ల రైస్ మిల్లు యజమానులు సీజన్‌కు అనుగుణంగా సీఎంఆర్ బియ్యాన్ని సర్కారుకు ఇవ్వకుండా దాటవేత వైఖరిని అవలంభిస్తూ ధాన్యాన్ని రోటేషన్ పద్దతి పక్కదారి పట్టిస్తున్నారన్న ఫిర్యాదులున్నాయి.

సీఎంఆర్ బకాయిలు లేని మిల్లులకే ప్రాధాన్యం

ఇప్పటి వరకు 100 శాతం సీఎంఆర్ బియ్యాన్ని తిరిగి చెల్లించిన రైస్‌మిల్లులకే ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన ధాన్యాన్ని కేటాయించనున్నారు. ఈ మేరకు అధికారులు స్పష్టమైన ప్రకటన జారీ చేయడం కొంతమంది బకాయిలున్న రైస్‌మిల్లర్లకు మింగుడు పడడం లేదు. నిర్మల్ జిల్లాలో మొత్తం 75 రైస్‌మిల్లులు ఉండగా ఇందులో నుంచి 15 బాయిల్డ్ రైస్‌మిల్లులు కాగా మరో 60 రా రైస్‌మిల్లులున్నాయి. అయితే ఇందులో నుంచి ఇప్పటికే 17 రైస్‌మిల్లులకు బకాయిలపై 25శాతం పెనాల్టీ విధించారు. కొన్ని రైస్‌మిల్లులు కూడా నవంబర్ 30 సీఎంఆర్ బకాయి బియ్యాన్ని ఇవ్వాల్సి ఉంది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి సీఎంఆర్ కోసం ఈ రైస్‌మిల్లులకు మినహాయింపునిచ్చే విషయంపై ఇంకా స్పష్టత రావడం లేదంటున్నారు.

అంతా వ్యూహాత్మకమే

కాగా సీఎంఆర్ బియ్యం చెల్లింపు విషయంలోనూ, పెనాల్టీ బియ్యం చెల్లింపు విషయంలోనూ మొదటి నుంచి రైస్‌మిల్లర్లు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ సర్కారును పక్కదొవ పట్టిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 2022-2023 ఖరీఫ్, రబీ సీజన్‌లకు సంబంధించిన సీఎంఆర్ బియ్యాన్ని పూర్తిస్థాయిలో చెల్లించకుండా మొండిగా వ్యవహరిస్తున్న రైస్‌మిల్లు యజమాన్యాలపై ఇప్పటి వరకు కఠిన చర్యలు లేకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ప్రభుత్వం దాదాపు 37వేల యంటీఎస్‌ల సీఎంఆర్ బియ్యాన్ని 25శాతం పెనాల్టీతో చెల్లించాలంటూ 17 రైస్‌మిల్లులకు విధించిన గడువు ముగిసినప్పటికి ఇప్పటి వరకు ఆ బియ్యం సర్కారుకు అందకపోవడం ఫిర్యాదులకు కారణమవుతోందంటున్నారు. రైస్‌మిల్లర్లు పకడ్బందీ పథకం ప్రకారమే ఈ వ్యవహారాన్ని దర్జాగా సాగిస్తున్నారంటున్నారు. కొంతమంది రైస్‌మిల్లర్లు తమకున్న రాజకీయ పలుకుబడి పరపతితో సంబంధిత అధికారులను ఒత్తిళ్ళకు గురి చేస్తున్నారన్న విమర్శలు లేకపోలేదు. అధికారుల హెచ్చరికలను రైస్‌మిల్లు యజామాన్యాలు బేఖాతరు చేస్తుండడం అనుమానాలకు తావిస్తోంది. బకాయిలున్న కొన్ని రైస్‌మిల్లులను సంబంధిత యజమానులు మూసివేస్తూ కొత్త రైస్‌మిల్లులను సైతం ప్రారంభిస్తుండడం అనుమానాలకు ఆస్కారమిస్తోందని చెబుతున్నారు.

సీఎంఆర్ బకాయిలపై చర్యలు తీసుకుంటాం



సీఎంఆర్ బియ్యం బకాయిలపై తప్పనిసరిగా చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే బకాయిలున్న మిల్లులకు నోటీసులు జారీ చేశాం. గడువు ముగియడంతో నిబంధనలకు అనుగుణంగా చర్యలుంటాయి. ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గేది లేదు. నిబంధనలను ఉల్లంగించే వారిపై త్వరలోనే చర్యలు తీసుకుంటాం.

- కిషోర్‌కుమార్, అడిషనల్ కలెక్టర్, నిర్మల్ జిల్లా

రైతు సమస్యలపై ప్రత్యేక దృష్టి

● ఎమ్మెల్యే రాంరావు పటేల్



బాసరలో సోయా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాంరావు

బాసర, అక్టోబర్, 22 : (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేకదృష్టి సారిస్తున్నట్లు ముథోల్ ఎమ్మెల్యే రాంరావు పటేల్ అన్నారు. మంగళవారం బాసర మండల కేంద్రంలో సోయా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో నెలకొన్న సమస్యలపై త్వరగా తీర్చేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ప్రతిపక్షం అయినప్పటికీ ఎకరానికి ఆరున్నర క్వింటాళ్ల ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలు రూ.4,890 ధరతో కొనుగోలు చేస్తారని చెప్పారు. ఎకరం పది క్వింటాళ్ల కొనుగోలు జరిగేలా ప్రభుత్వాన్ని సంప్రదించి ప్రయత్నించినట్లు వివరించారు. దళారులను నమ్మి అమ్ముకోవద్దని సూచించారు. రైతుల సమస్యలపై అసెంబ్లీలో కూడా ప్రస్తావించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెంకటేష్‌గౌడ్, తహసీల్దార్ పవన్‌చంద్ర, మాజీ జడ్పీటీసీ రాజేశ్వర్, మాజీ సర్పంచ్ సతీశ్వర్ రావు, బీజేపీ నాయకులు కే. ప్రతాప్‌రావు, బీజెవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి పీ. సాయినాథ్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సకల సౌకర్యాలు కల్పిస్తాం

ముథోల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ముథోల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సకల సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తానని ముథోల్ ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ అన్నారు. మండల కేంద్రమైన ముథోల్‌లో నూతనంగా మంజూరైన ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గ కేంద్రమైన ముథోల్, బాసర, తానూర్, లోకేశ్వరం మండల విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. డిగ్రీ కళాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా విద్యార్థులకు తగు సౌకర్యాలు కల్పించడమే ధ్యేయంగా ముందుకు వెళ్తానన్నారు. జిల్లాలోని భైంసా, నిర్మల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తరహాలో ముథోల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను తయారు చేస్తామని పేర్కొన్నారు. అవసరమైన ఫర్నిచర్, ల్యాబ్ తదితర సౌకర్యాలన్నీ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను అధ్యాపక బృందం సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కర్రోళ్ల బుచ్చయ్య, నిర్మల్ ప్రిన్సిపాల్ సుధాకర్, ముథోల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సునీల్, వీడీసీ చైర్మన్ నారాయణ, సభ్యులు రోళ్ల రమేష్, సాయినాథ్, వెంకటేష్, గ్రామస్తులు కోరి పోతన్న, టి.రమేష్, దశరథ్, సుదర్శన్, శ్రీనివాస్, ఎంఈవో రమణరెడ్డి, ఎంపీడీవో శివకుమార్, ఈవో ప్రసాద్‌గౌడ్, గ్రామస్థులు, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళా కాంగ్రెస్ సభ్యత్వంలో జిల్లా అగ్రస్థానం



నిర్మల్ కల్చరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ మహిళా సభ్యత్వ నమోదులో జిల్లా అగ్రస్థానంలో ఉందని ఆ పార్టీ ఉపాధ్యక్షురాలు అల్లూరి కృష్ణవేణి అన్నారు. ఈ సందర్భంగా ఆమెను ఢిల్లీలో జాతీయ అధ్యక్షురాలు అల్కాలాంబ ఆమెను అభినందించారు. తెలంగాణ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సునీతారావు పాల్గొన్నారు.

కొమురం భీమ్‌కు డీసీసీ అధ్యక్షుడి నివాళులు



నిర్మల్ కల్చరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : కొమురం భీమ్ జయంతి సందర్భంగా మంగళవారం డీసీసీ అధ్యక్షుడు కే.శ్రీహరిరావు ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జల్, జంగల్, జమీన్ ఉద్యమం చేసి గిరిజనుల హక్కుల కోసం అప్పటి నైజాం సర్కార్‌తో వీరోచిత పోరాటం చేసి ప్రాణాలర్పించిన వీరుడని కొనియాడారు. మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, కమిషనర్ సీవీఎన్ రాజు, ఏఎంసీ చైర్మన్ భీమ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దిలావర్‌పూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : జల్, జంగల్, జమీన్ కోసం నిరంకుశ నిజాం నవాబునే ఎదిరించి పోరాడిన ఆదివాసీల ముద్దుబిడ్డ కొమురం భీమ్ జయంతిని మండలంలో ఘనంగా నిర్వహించారు. దిలావర్‌పూర్, న్యూలోలం, బన్సపల్లి, మాడెగాం, కదిలిలో కొమురం భీమ్ చిత్రపటానికి, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గ్రామాల్లో కార్యక్రమాల్లో ఆదివాసి నాయక్‌పోడ్ నాయకులు భూమయ్య, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే కఠినచర్యలు

● జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నిర్మల్ అర్బన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాలను ప్రోత్సహించే వారిపై కఠినచర్యలు తీసుకోవాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులతో బాల్య వివాహాల నియంత్రణ, బాలల అక్రమ రవాణా, లైంగిక వేధింపులు తదితర అంశాలపై ఆమె స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో బాల్య వివాహాల నియంత్రణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తండాలు, గూడాలు, గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహాలను పూర్తి స్థాయిలో నిర్మూలించేందుకు అన్ని రకాల చర్యలు చేపట్టాలని సూచించారు. బాల్య వివాహాలపై సమాచారం అందిన వెంటనే అధికారులు స్పందించాలని, పోలీసుశాఖ అధి కారులకు పూర్తి సహకారం అందించాలన్నారు. బాల్య వివాహాలను నియంత్రించేందుకు గ్రామ పంచాయతీలలో తీర్మానాలు చేయాలన్నారు. బాల కార్మిక వ్యవస్థ రూపుమాపేందుకు చర్యలు చేపట్టాలని, బాలలను పనిలో పెట్టుకునే యజమానులపై చట్టపరంగా కఠినచర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. బాలలకు రక్షణ కల్పించేందుకు 1098 టోల్ ఫ్రీ నెంబర్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఎస్పీ గంగారెడ్డి, డీఆర్డీవో విజయలక్ష్మి, డీఈవో రవీందర్‌రెడ్డి, సంక్షేమ శాఖల అధికారులు, సీడబ్ల్యూసీ సభ్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించండి

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం నిర్మల్ పట్టణ పరిధిలని మంజులాపూర్‌లో చేపట్టిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను వేగవంతంగా పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. ప్రభుత్వ భూములను కాపాడాలని, చెరువులు, కుంటలు, కాలువల హద్దులను గుర్తించాలని సూచించారు. ఎల్ఆర్ఎస్ ప్రక్రియలో భాగంగా నీటిపారుదల, రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్ అధికారుల యాప్‌ను కలెక్టర్ పరిశీలించి అధికారులకు కీలక సూచనలు చేశారు. అధికారులు సమన్వయంతో ప్రభుత్వ నిబంధనలను పాటిస్తూ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. ఈ పరిశీలనలో మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు, తసీల్దార్‌రాజు, నీటిపారుదలశాఖ ఏఈఈ మిరాజ్, టౌన్ ప్లానింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

బాలశక్తి కార్యక్రమాన్ని మరింత పకడ్బందీగా నిర్వహించాలి

బాలశక్తి కార్యక్రమాన్ని మరింత పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలో ప్రత్యేకంగా విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన బాలశక్తి కార్యక్రమ అమలుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... బాలశక్తి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ప్రభుత్వ విద్యాసంస్థల విద్యార్థుల్లో ఆర్థిక అక్షరాస్యతను ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా రోజువారి బ్యాంకింగ్ కార్యకలాపాలు, బ్యాంకులు పౌరులకు అందించు సేవలను గురించి అవగాహన కల్పించాలని తెలిపారు. అంతకుముందు చెకుముకి సైన్స్ సంబురాలు పోస్టర్‌ను జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఈవో రవీందర్‌రెడ్డి, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రాంగోపాల్, డీఆర్డీవో విజయలక్ష్మి, వైద్యాధికారులు శ్రీనివాస్, సౌమ్య, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఏఎంసీ చైర్మన్

నిర్మల్ కల్చరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల పదవీ బాధ్యతలు స్వీకరించిన నిర్మల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్‌రెడ్డి మంగళవారం కలెక్టర్ అభిలాష అభినవ్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఆయనతో పాటు వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్ కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు. వడ్ల కొనుగోళ్ల సందర్భంగా రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని కలెక్టర్‌ను కోరారు.

యూనివర్సిటీలో అధ్యాపకులే కీలకం

● ట్రిపుల్ ఐటీ వీసీ గోవర్ధన్



అధ్యాపకులతో వీసీ గోవర్ధన్ సమావేశం

బాసర, అక్టోబర్, 22: (ఆంధ్రజ్యోతి) యూనివర్సిటీ పురోగతిలో అధ్యాపకులే కీలకమని బాసర ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీ వైస్‌చాన్సలర్ గోవర్ధన్ అన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వీసీని మంగళవారం అధ్యాపకుల సంఘం నాయకులు, అధ్యాపకులు కలిసి పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ యూనివర్సిటీ స్థాపించిన నాటి నుండి పనిచేస్తున్న విషయాన్ని గుర్తు చేస్తూ ఈ యూనివర్సిటీ అభివృద్ధిలో భాగస్వాములు అయినందుకు అధ్యాపకులను అభినందించారు. సహాయ సహకారాలు అందిస్తూ సమన్వయంతోనే పనిచేస్తేనే యూనివర్సిటీ పురోగతి తథ్యమని పేర్కొన్నారు. యూనివర్సిటీ గురించి అధ్యాపకుల నుంచి వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీశైలం, జనరల్ సెక్రటరీ కృష్ణప్రసాద్, సహ కార్యదర్శులు సతీష్ కుమార్, డా. సాయికృష్ణ, డా. ఎన్. విజయ్‌కుమార్, డా.రమాదేవి, డా.రాములు, వసంత్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్థులు కలిసిమెలిసి ఉండాలి

● భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్



ముథోల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : గ్రామంలోని గ్రామస్థులు కలిసి మెలిసి ఉండాలని భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్ అన్నారు. మంగళవారం ముథోల్ మండలంలోని బోరిగాం గ్రామాన్ని ఆర్డీవో కోమల్ రెడ్డితో కలిసి సందర్శించారు. గ్రామంలో ఇటీవల నెలకొన్న వివాదంపై గ్రామస్థులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్థులను ఉద్దేశించి మాట్లాడుతూ... గ్రామస్థులందరూ కలిసిమెలిసి ఉంటూ గొడవలు చేసుకోవద్దన్నారు. శాంతిభద్రతలకు భంగం వాటిల్లకుండా గ్రామస్థులు సహకరించా లన్నారు. సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీకాంత్, సీఐ జి. మల్లేష్, ఎస్సై సాయికిరణ్, ఆర్ఐనారాయణ పటేల్, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్థులు, తదితరులు ఉన్నారు.

సభ్యత్వ లక్ష్యాన్ని పూర్తి చేయండి

యెండల లక్ష్మీనారాయణ



నిర్మల్ కల్చరల్, అక్టోబరు 22 : జిల్లా బీజేపీ సభ్యత్వ లక్ష్యాన్ని గడువులోగా పూర్తి చేయాలని ఆ పార్టీ సంస్థాగత ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎండల లక్ష్మీనారాయణ శ్రేణులకు సూచించారు. మంగళవారం పార్టీ కార్యాయంలో ఏర్పాటు చేసిన కార్యవర్గ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... మండల, పట్టణ కమిటీలు తమకు నిర్దేశించిన లక్ష్యాలు పూర్తి చేయాలన్నారు. ప్రజలు బీజేపీ విధానాల పట్ల ఆకర్షి తులవుతున్నారని తెలిపారు. ప్రధాని మోదీ నేతృత్వంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించి సభ్యత్వం తీసుకునేలా ప్రోత్సహించా లన్నారు. పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ మల్లికార్జున్ రెడ్డి, కమల్ నయన్, గాదె విలాస్, సాదం అరవింద్, తదితర నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

బాధితులకు మాజీ మంత్రి పరామర్శ

నిర్మల్ కల్చరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలు యాదవ్‌తో పాటు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మల జగన్మోహన్‌రెడ్డిని ఆయన నివాసంలో మంగళవారం మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. నాయకులు ఆయన వెంట ఉన్నారు.

యాగ స్థల ఏర్పాట్ల పరిశీలన

నిర్మల్ కల్చరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్‌లో నవంబరు 7 నుంచి నిర్వహించనున్న వైష్ణవ అయుత చండీయాగం కోసం స్థలాన్ని, ఏర్పాట్లను మంగళ వారం మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, డీసీసీ అధ్యక్షుడు కే.శ్రీహరిరావు సందర్శించారు. ఎస్పీ కార్యాలయం ఎదురుగా శ్రీకృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామి నేతృత్వంలో విశ్వశాంతి మహాయాగ మహోత్సవాన్ని నిర్వహించనున్నారు.

వృద్ధుడి అదృశ్యం

భైంసా రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన పన్నాల రామ్‌రెడ్డి(80) అనే వృద్ధుడు దిలావర్‌పూర్ గ్రామానికి వెళ్తానని చెప్పి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబీకులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. కుమారుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

కేజీబీవీలో 16 ఖాళీల భర్తీ : డీఈవో

నిర్మల్ కల్చరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని కేజీబీవీ పాఠశాలల్లో 31 పోస్టులు ఖాళీలుండగా 16 ఖాళీలు భర్తీ చేసినట్లు డీఈవో రవీందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ అనుమతితో 9 పీజీ, 6 సీఆర్టీలు, టీఆర్‌ఎస్‌లో ఒకటి ఖాళీ భర్తీ చేశామని తెలిపారు.


పాఠశాలల ఆకస్మిక తనిఖీ

సోన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెల్మల్ బొప్పారం, కూచన్‌పెల్లి పాఠశాలలను మండల విద్యాధికారి తోడిశెట్టి పరమేశ్వర్ ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. విద్యార్థులు పరీక్షలను చక్కగా రాసేటట్లు ఉపాధ్యాయుల చూడాలన్నారు. అనంతరం ఆయా పాఠశాలల్లో సౌకర్యాలను, మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు.

యాకర్‌పెల్లిలో సీసీ కెమెరాలు ఏర్పాటు

సారంగాపూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గల యాకర్‌పెల్లిలో సీసీ కెమెరాలను గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో సీఐ రామకృష్ణ, ఎస్సై శ్రీకాంత్‌లు సీసీ కెమెరాలను పరిశీలించి, సీసీ కెమెరాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గ్రామస్తులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంతో గ్రామస్తులను అభినందించారు. అలాగే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామస్థులందరూ సహకరించాలని పేర్కొన్నారు.

పోలీసుల అమరవీరులకు నివాళులు



నర్సాపూర్(జి), అక్టోబరు 22 : మండల కేంద్రంలో మంగళవారం విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసి అమరులైన పోలీసులకు తెలంగాణ రాష్ట్ర ప్రజల తరఫున నివాళి అర్పించారు. పోలీసులు, ప్రజలు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై హనుమాన్లు, ఏఎస్సై మాన్‌సింగ్, పోలీసులు మహేందర్, కృష్ణ, సంజీవ్, అన్వర్ అలీ, నాయకులు గడ్డం ఇంద్రకరణ్‌రెడ్డి, చిన్న రామయ్య, మల్లేష్, గ్రామస్థులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న కాలనీవాసులు

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

● ఖాళీ బిందెలతో కాలనీవాసుల నిరసన

ఆదిలాబాద్ రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): తమ కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆదిలాబాద్ పట్టణంలోని కేఆర్కే కాలనీవాసులు ఆందోళనకు దిగారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట బైఠాయించి ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. కొన్ని రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు వాపోయారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే నీటి సమస్య ఏర్పడిందని, కలెక్టర్ స్పందించి సమస్యను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు లాంటిలే సంతోష్, బోడకుంట రాజు, ముబారక్ పాల్గొన్నారు.

కడుపు నొప్పి భరించలేక ఆత్మహత్య

ఇంద్రవెల్లి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కడుపు నొప్పి భరించలేక పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసిన ఘటన మండలంలోని వడగామ్ గ్రామంలో జరిగింది. కుటుంబీకులు, బంధువులు, ఎస్సై దుబ్బాక సునీల్ తెలిపిన వివరాల ప్రకారం జైనూర్ మండలంలోని డబోలి గ్రామానికి చెందిన మెస్రం రాజేష్(20) గత కొంత కాలం నుంచి కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. కుటుంబ సభ్యులు ఆసుపత్రిలతో పాటు నాటు వైద్యం చేయించిన ఆరోగ్యం కుదుటపడ లేదు. అయితే ఈనెల 20న ఇంద్రవెల్లి మండలంలోని వడగామ్ గ్రామంలో ఉంటున్న తమ సమీప బంధువుల వద్దకు వచ్చాడు. ఈనెల 21న వడగామ్ సమీపంలో గల పాటగూడ శివారులోని ఓ వ్యవసాయ చేనుకు వెళ్ళి గుర్తు తెలియని పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు గమనించి బంధువులకు సమాచారం అందించడంతో ఆటో ద్వారా ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం తెల్లవారు జామున మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి తండ్రి మెస్రం భీంరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కుక్కల దాడిలో చిన్నారులకు గాయాలు

ఆదిలాబాద్ రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకోలి గ్రామంలో వీధి కుక్కలు ఐదు సంవత్సరాల బాలుడు, 13 సంవత్సరాల బాలికపై దాడి చేశాయి. ముఖంపై దాడి చేయగా గాయాలు కావడంతో రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స అందించారు. దీంతో వరుస కుక్కల దాడులతో గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. పిల్లలు పాఠశాలకు వెళ్లాలన్న భయానికి గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే సమస్య పరిష్కారించాలని కోరుతున్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి?!

తాంసి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొన్న సంఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఇది ఆత్మహత్యనా.. లేక ప్రమాదమా అనే విషంపై పలువురు పలు విధాలుగా చర్చించుకుంటున్నారు. వివరాల్లోకి వెళితే.. ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలం పొన్నారి గ్రామానికి చెందిన గుమ్మల దేవన్న(38) అనే వ్యక్తి పొలం పనుల కోసం మంగళవారం మధ్యాహ్నం మూడున్నర గంటల ప్రాంతంలో చేనులోకి వెళ్లాడు. మధ్యాహ్నం సమయంలో నాందేడ్ నుంచి ఆదిలాబాద్‌కు వస్తున్న రైలు వెళ్లిన తరువాత ఆయన శవమై కనిపించాడు. ఈ సంఘటన హస్నాపూర్ గ్రామ సమీపంలో జరిగింది. ఈ సంఘటన చూసిన చుట్టూ పక్కల వారు వెంటనే రైల్వే పోలీసులకు సమాచారాన్ని అందించారు. ప్రస్తుతం వారు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. దేవన్న మృతి ప్రమాదవశాత్తు జరిగిందా? ఆత్మహత్య చేసుకున్నాడా? అనే విషయంపై పూర్తి వివారలు ఇంకా తెలియరాలేదు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

అంకితభావంతో పని చేస్తేనే గుర్తింపు

● ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్

తాంసి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): అధికారులు, ఉపాధ్యాయులు అంకిత భావంతో పని చేసినప్పుడే మంచి గుర్తింపు వస్తుందని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్ అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో పాఠశాల భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు ప్రజల్లో గుర్తింపు పొందాలంటే అంకితభావంతో పని చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశ పెడుతున్న పథకలను ప్రజల ముందుకు చేర్చాల్సిన బాధ్యత అధికారులతో పాటు, యువకులపై కూడా ఉందని అన్నారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేలా చర్యలు చేపట్టాలన్నారు. పనుల్లో నాణ్యత లోపం లేకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులదేనని సూచించారు. నాణ్యత లోపం జరిగితే మాత్రం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్, పలువురు నాయకులు, తదితరులు ఉన్నారు.



తాంసిలో పాఠశాల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

● ఆశ్రమ పాఠశాలలో ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ

తాంసి(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులు ఉపయోగించే మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉండటం పట్ల సంబంధిత సిబ్బందిపై సీరియస్ అయ్యారు. అసలు వసతి గృహంలో సిబ్బంది నిత్యం వస్తున్నారా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు సరైన సౌకర్యాలు కల్పించకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి ఇలాంటి అపరిశుభ్రత కనిపిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉపాధ్యాయులు అంకిత భావంతో పని చేయాలని సూచించారు.

● కేంద్ర ప్రభుత్వ నిధులతో అదనపు గదుల నిర్మాణం

ఆదిలాబాద్ రూరల్(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నిధులతో గిరిజన కళాశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణం కోసం గిరిజన సంక్షేమ శాఖ నుంచి ఆర్టికల్ 275/1 కింద రూ.75 లక్షలు మంజూరైనట్లు ఆదిలాబాద్ ఎంపీ గొడం నగేష్ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని గిరిజన బాలుర జూనియర్ కళాశాల ఆవరణలో అదనపు తరగతి గదుల నిర్మాణం కోసం ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ గోడం నగేష్ మాట్లాడారు.

కొమురం భీం పోరాట పటిమ మరువలేనిది

● రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి

ఆదిలాబాద్ అర్బన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఆదివాసీ పోరాట యోధుడు కొమురంభీం జయంతి కార్యక్రమాన్ని మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆదిలాబాద్ పట్టణంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ఆదివాసీల హక్కుల కోసం నిరంకుశులతో పోరాడిన గోండు వీరుడు కొమురం భీమ్ పోరాట పటిమ ఎన్నటికి మరువలేనిదన్నారు. ఇందులో నాయకులు ధర్మపురి చంద్రశేఖర్, కనకగంగారాం, కోట్నాక్ భరత్, మడావి సంతోష్, మేస్రం భరత్, అట్ల గోవర్ధన్‌రెడ్డి,వేముల నాగరాజు, మర్సకోల గౌతమ్, కుదురుపాక సురేష్, కోరటి ప్రభాకర్, చారి, తదితరులున్నారు.



ఆదిలాబాద్‌లో భీం విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

● గిరిపుత్రుల హక్కుల కోసం పోరాటం చేసిన యోధుడు

నార్నూర్(ఆంధ్రజ్యోతి): జల్ జంగిల్ జమీన్ నినాదంతో గిరిపుత్రుల హక్కుల కోసం సాయుధ పోరాటం చేసిన యోధుడు కొమురంభీం అని ఉమ్మడి జిల్లా రాయిసెంటర్ సార్మెడి దురుగు పటేల్, ఆదివాసీ జేఏసీ అధ్యక్షుడు మేస్రం హన్మంతు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో కొమురం భీం జయంతి సందర్భంగా తుడుందెబ్బ ఆదివాసీ జేఏసీ ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో కొమురంభీం విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఇందులో ఆదివాసీ గిరిజన నాయకులు మడావి మన్కు, మాజీ సర్పంచ్ బి.గజానంద్‌నాయక్, కనక ప్రభాకర్, ప్యాక్స్ ఇన్‌చార్జీ చైర్మన్ సురేష్, ఆడే తొడసం నాగోరావు, రూపుదేవు ఆడ శ్రీరామ్,మానిక్‌రావు, రూపుదేవు, మాజీ ఎంపీపీ రూపుదేవు కొరల మహేందర్, తదితరులున్నారు.

రైతు ఆత్మహత్యలు పెరిగాయి : జోగు రామన్న

ఆదిలాబాద్ అర్బన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): బూటకపు హామీలతో గద్దెనెక్కిన ముఖ్యమంత్రి ప్రభుత్వ హయాంలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మాజీ మంత్రి, జిల్లా అధ్యక్షుడు జోగురామన్న అన్నారు. మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో 24న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొనున్న సభ వివరాలను వెల్లడించారు. అనంతరం మాజీ మంత్రి జోగురామన్న మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హాయాంలో అన్నదాతల ఆత్మహత్యలు పెరిగి పోయాయని, రైతు భరోసా ఎగ్గొట్టి ప్రభుత్వం రైతుల ఉసురు తీసుకుంటుందన్నారు. ఆరు గ్యారంటీలను చూపి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కాగా రైతాంగం సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ ధర్నాలు చేపడుతున్న తమపై కేసులు నమోదు చేస్తున్నారని అన్నారు. 24న రాంలీలా మైదానంలో ప్రభుత్వ వైఫల్యాలపై కేటీఆర్ శంఖారావం పూరించనున్నారని, ఈ బహిరంగ సభకు ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఇందులో రోకండ్ల రమేష్, అజయ్, ఇజ్జగిరి నారాయణ, మెట్టు ప్రహ్లాద్, గంద్రత్‌రమేష్,కుమ్రరాజు, వేణుగోపాల్‌యాదవ్, పరమేశ్వర్, నవతే శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కాగా, ఈనెల 24న ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీవర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేపట్టే నిరసన కార్యక్రమానికి సంబంధించిన సభ ప్రాంగణ పనులను మంగళవారం మున్సిపల్ చైర్మన్ జోగుప్రేమేందర్ స్థానిక కౌన్సిలర్‌తో కలిసి పనులను పరిశీలించారు.

● సీఎంపై కేసు నమోదు చేయాలని ఎస్పీకి వినతి

ఆదిలాబాద్ అర్బన్(ఆంధ్రజ్యోతి): బూటకపు హామీలతో ప్రజలను మోసం చేసిన సీఎం రేవంత్‌రెడ్డిపై చీటింగ్ కేసులు నమోదు చేయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న డిమాండ్ చేశారు. మంగళవారం ఎస్పీ గౌస్‌ఆలంను కలిసి వినతిపత్రం అందజేశారు. ఉట్నూర్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కేసులు నమోదు చేయడాన్ని మాజీ మంత్రి ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా రామన్న మాట్లాడుతూ ఎన్నికల సమయంలో బూటకపు హామీలతో ప్రజలను మోసం చేసిన ముఖ్యమంత్రిపై చీటింగ్ కేసులు నమోదు చేయాలని కోరారు.

కంకర క్వారీలను మింగేస్తున్నారు!

(5వ పేజీ తరువాయి)

రూ.5.52, రాయల్ స్టోన్ క్రషర్ జున్ని రూ.2.34 కోట్లు, బజార్‌హత్నూర్ మండలం పిప్రిలోని జైహనుమాన్ క్రషర్‌కు రూ.7.72 కోట్లు, ఇచ్చోడ మండలం బబుల్‌లోడి షార్ప్ స్టోన్‌క్రషర్స్‌కు రూ.12.2కోట్లు, బజార్‌హత్నూర్ మండలం పిప్రి శ్రీకృష్ణ స్టోన్ క్రషర్‌కు రూ.4.79కోట్లు, బజార్‌హత్నూర్ మండలం చింతల్‌సాంగ్వి కోటేశ్వర్‌రెడ్డి స్టోన్‌క్రషర్‌కు రూ.2.76 కోట్ల పెనాల్టీని విధించినట్లు అధికారులు పేర్కొన్నారు. అయితే నెలల తరబడి క్వారీల యజమానులు పెనాల్టీ చెల్లింపుల్లో జాప్యం చేయడంతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోంది. అధికారులు కూడా చూసీ చూడనట్లుగానే వ్యవహరించడంతో అనుకున్నంత స్థాయిలో ఆదాయం రావడం లేదన్న విమర్శలు వస్తున్నాయి.

ప్రభుత్వ సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులకు చేరాలి : ఎమ్మెల్యే పాయల

జైనథ్, అక్టోబరు 22: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంక్షేమానికి ప్రవేశ పెట్టిన వివిధ సంక్షేమ పథకాలు దళారి వ్యవస్థ లేకుండా నేరుగా లబ్ధిదారులకు చేరాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన జైనథ్ ఎంపీడీవో కార్యాలయంలో 51 మంది లబ్దిదారులకు రూ.లక్షా 116 చొప్పున కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అధికారులు నాయకులతో కలిసి పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో రవాణా వ్యవస్థను రూపుదిద్దే విధంగా ప్రణాళికలను రూపొందించి ప్రభుత్వానికి నివేదించామన్నారు. ఇందులో జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి అశోక్‌రెడ్డి, జైనథ్ మండల తహసీల్దార్ శ్యాంసుందర్, ఎంపీడీవో వెంకట్‌రాజ్, నాయకులు అస్తక్ సుభాష్, పెండల్‌వాడ అశోక్‌రెడ్డి, అడ్డి రూకేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆయుధాలపై అవగాహన

బోథ్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్స వాలను పురస్కరించుకుని మంగళవారం బోథ్ పోలీస్‌స్టేషన్‌లోయ విద్యార్థులకు ఆయుధాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ రమేష్ మాట్లాడుతూ వారోత్సవాల సందర్భంగా రోజుకో విధంగా కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అయితే మంగళవారం రోజున విద్యార్థులకు ఆయుధాల పనితీరు, పోలీసులు చేసే విధులు, పోలీస్‌స్టేషన్‌లో ఉన్న వసతులతో పాటు పోలీసులు చేసే పనుల గురించి ఈ సందర్భంగా వివరించడం జరిగింది. కార్యక్రమంలో ఎస్సై ప్రవీణ్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో జిల్లా విద్యార్థుల ప్రతిభ

ఆదిలాబాద్ రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి రెడ్ రిబ్బన్ క్లబ్ పోటీల్లో తెలంగాణ స్థాయిలో పది జిల్లాల నుంచి వచ్చిన విద్యార్థులు క్విజ్ పోటీల్లో పాల్గొనగా.. పట్టణంలోని టీజీడబ్ల్యూఆర్‌జేసీ గర్ల్స్ విద్యార్థినులు బి.సమిక్షా, ఎం.అక్షయ ప్రతిభ కనబర్చి మూడోస్థానం నిలిచారు. కాగా దీనికి సంబంధించి మంగళవారం బహుమతులు అందుకున్నారు. అయితే, ప్రిన్సిపాల్ బి.లలిత కుమారి ప్రోత్సాహంతో గెలుపొందినట్లు విద్యార్థినులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు విద్యార్థినులను అభినందించారు.

వర్షానికి తడిసిన పంటలు

సోన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆయా గ్రామాల్లో మంగళవారం మధ్యాహ్నం ఒక్కసారిగా వర్షం కురవడంతో చేతికి వచ్చిన పంట తడిసిపోయింది. రైతులు టార్పాలిన్లు కప్పి తన పంటను రక్షించుకునే ప్రయత్నం చేశారు. మొక్కజొన్న, సోయాబీన్ పంటలు చేతికి రావడంతో కల్లాల్లో ఆరబెడుతున్న సమయంలో ఈ అకాల వర్షం కురవడంతో మండలంలోని ఆయా గ్రామాల్లో వేసిన పంటలు దెబ్బతింటున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.

వానల్‌పాడ్‌లో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం



కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలో పట్టుబడ్డ వాహనాలు

భైంసా రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వానల్‌పాడ్ గ్రామంలో జిల్లా ఎస్పీ జానకి షర్మిల, ఏఎస్పీ అవినాష్ కుమార్‌ల ఆదేశాల మేరకు భైంసా రూరల్ సీఐ నైలు మంగళవారం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. సరైన ధ్రువపత్రాలు లేని 72 ద్విచక్ర వాహనాలు, 2 ఫోర్ వీలర్స్ వాహనాలను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం సీఐ నైలు గ్రామ పంచాయతీ ఆవరణలో గ్రామ ప్రజలతో సమావేశమై మాట్లాడారు. రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ వాహనాలు జాగ్రత్తగా నడపాలని, చైన్ స్నాచింగ్, సైబర్ నేరాలపై అవగాహన, సమాజం పట్ల ప్రజల బాధ్యతయుతంగా ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరూ సీసీ ఫుటేజ్ పెట్టుకోవాలని కోరారు. అవాంఛనీయ సంఘటనలు జరిగినచో సొంత నిర్ణయాలు తీసుకోకుండా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ ఎస్సై శ్రీనివాస్, కుంటాల ఎస్సై, పోలీస్ బృందం, తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని వ్యవసాయ కూలీ ఆత్మహత్య

భైంసా రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బిజ్జూర్ గ్రామంలో మంగళవారం గుండెరావు సుభాష్ ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బిజ్జూర్ గ్రామానికి చెందిన గుండెరావు సుభాష్(34) వ్యవసాయ కూలీ పని చేస్తూ జీవనం కొనసాగించేవారు. గత కొద్ది రోజుల క్రితం కొత్త ఇళ్లు నిర్మించి అప్పుల పాలయ్యాడు. అప్పులు ఎలా తీర్చాలని ఆవేదనతో తన ఇంట్లో ఉదయం 5 గంటలకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య త్రిషల పిటిషన్ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు.

నేడు కొమురం సూరు వర్ధంతి

పెంబి, అక్టోబరు 22 : నేడు జరిగే కొమురం సూరు వర్ధంతిని విజయవంతం చేయాలని ఆదిమ గిరిజన కొలం సంఘ జిల్లా అధ్యక్షులు టేకం భీమ్‌రావు అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ... మండలంలోని వేణునగర్ గ్రామంలో బుధవారం జరిగే కొమురం సూరు వర్ధంతి ఆదివాసీలు, నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి విజయవంతం చేయాలన్నారు.

పశువులకు టీకాలు

సోన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లోకల్ వెల్మల్ గ్రామంలో మండల పశువైద్యాధికారి ఓం ప్రకాష్ గేదెలకు మంగళవారం టీకాలను వేశారు.

100 గ్రాములు ఎక్కువ తూకం వేసినా

క్రిమినల్ కేసులు బుక్ చేస్తా

● ట్రాన్స్‌పోర్ట్ కోసం రూపాయి ఇచ్చేది లేదు ● తరుగు పేరుతో దోచుకుంటే రైస్‌మిల్లర్లపై కఠినచర్యలు ● ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

లక్ష్మణచాంద, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలులో 100 గ్రాములు ఎక్కువ తూకం వేసిన ఊరుకునేది లేదని సంబంధిత నిర్వాహకులపై క్రిమినల్ కేసులు బుక్ చేస్తానని నిర్మల్ ఎమ్మెల్యే, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మంగళవారం అన్నారు. మండలంలోని రాచాపూర్ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో దొడ్డు రకం ధాన్యానికి, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో సన్న రకం ధాన్యానికి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఏ గ్రేడ్ వరి ధాన్యానికి రూ. 2,320, బి గ్రేడ్ వరి ధాన్యానికి రూ. 2,300లు ప్రభుత్వం మద్దతు ధర చెల్లిస్తుందని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. నిర్ణీత తూకం 41 కిలోల (1 కిలో ఖాళీ బ్యాగ్ వెయిటేజి) కంటే 100 గ్రాములు ఎక్కువ తూకం వేస్తే సంబంధిత డీసీఎంఎస్, ఐకేపీ కేంద్రాల నిర్వాహకులపై క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తానని హెచ్చరించారు. ట్రాన్స్‌పోర్ట్ కోసం లారీలకు రైతుల దగ్గర ఒక్కరూపాయి వసూలు చేసినా ఊరుకోనని స్పష్టం చేశారు. వసూలు చేసినట్లు తెలిస్తే సంబంధిత కాంట్రాక్టర్ల లైసెన్సులు రద్దు చేస్తామన్నారు. తూకం వేసిన వెంటనే రసీదులు ఇవ్వాలని లేదంటే చర్యలు తీసుకుంటామన్నారు. తరుగు పేరుతో రైతులను దోచుకోవాలని చూస్తే సంబంధిత రైస్ మిల్లులను సీజ్ చేయించి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జానకి, ఎంపీడీవో రాధా రాథోడ్, ఏవో వసంత్‌రావు, డీసీఎంఎస్ జిల్లా ఇన్‌చార్జి సాయి సూర్య, బీజేపీ నాయకులు సత్యనారాయణ గౌడ్, రావుల రాంనాథ్, అయిండ్ల భూపాల్‌రెడ్డి, అడ్వాల రమేష్, సురకంటి ముత్యంరెడ్డి, పోలాస గోవర్ధన్, అయిండ్ల శ్రీధర్ రెడ్డి, మంతెన చంద్రమోహన్‌రెడ్డి, బన్నెబోయిన పోశెట్టి, నాగుల రాజు, కాయిటి జీవన్ రెడ్డి, తదితరులు ఉన్నారు.



రాచాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

కొమురం భీమ్‌కు నివాళులు అర్పించిన ఎమ్మెల్యే

నిర్మల్ కల్చరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో మంగళవారం కొమురం భీమ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చైన్‌గేట్ వద్ద గల కొమురం భీమ్ విగ్రహానికి ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ విముక్తి కోసం నిజాం ప్రభుత్వంతో వీరోచిత పోరాటం చేశాడని కొనియాడారు. కొమురం భీమ్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందినవాడు కావడం గర్వకారణమన్నారు. జల్, జంగల్, జమీన్ అనే నినాదంతో ఉద్యమించి వీరమరణం పొందారన్నారు. నేటి తరానికి కొమురం భీమ్ స్ఫూర్తిదాయకమన్నారు. మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, నాయకులు పాల్గొన్నారు.

ఆసుపత్రిని సందర్శించిన..

ఇటీవల ప్రమాదం సంభవించిన నిర్మల్ బోధనాసుపత్రిని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మంగళవారం సందర్శించారు. విద్యుదాఘాతం వివరాలు తెలుసుకున్నారు. దగ్ధమైన వార్డులను పరిశీలించారు. బీజేపీ నాయకులు ఆయన వెంట ఉన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

నిర్మల్ పట్టణం వెంకటాపూర్ నుంచి నిస్స్ చర్చ్ తండా వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు పనులను ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. 1 కోటి 20 లక్షల రూపాయలతో నూతన రోడ్డు నిర్మిస్తున్నట్టు ఎమ్మెల్యే చెప్పారు. నాయకులు పాల్గొన్నారు.

'బీజేపీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలి'

భైంసా, అక్టోబరు 22 : బాధ్యతాయుతమైన విధానాల ద్వారా పార్టీ బాధ్యులందరూ సభ్యత్వ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎండల లక్ష్మీ నారాయణ సూచించారు. మంగళవారం భైంసాలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో ముథోల్ నియోజకవర్గ పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియపై చివరి దశ సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. పార్టీ బాధ్యులందరూ ప్రతి పోలింగ్ బూత్ నుంచి క్రియాశీలక, సాధారణ సభ్యత్వాల నమోదును చేపట్టాలన్నారు. లక్ష్యాన్ని మించి సభ్యత్వాల నమోదు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, సాధించిన విజయాలు, చేపట్టిన సంస్కరణల మూలంగా అన్ని ప్రాంతాల్లో బీజేపీకి రోజురోజుకు ప్రజాధారణ పెరుగుతోందన్నారు. అన్ని వర్గాల ప్రజలు పార్టీ వైపు దృష్టి సారించారని వివరించారు. ఈ సందర్భంగా నియోజక వర్గ పరిధిలోని ఏడు మండలాలు, భైంసా మున్సిపల్ పరిధిలో జరిగిన సభ్యత్వాల నమోదుపై సమీక్షించారు. ఇందులో పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి పైడిపెల్లి గంగాధర్, జిల్లా ఉపాధ్యక్షులు తాలోడ్ శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోపాల్ సర్డా, జిల్లా సభ్యత్వ కన్వీనర్ కమల్ నయన్, ముథోల్ అసెంబ్లీ ఇంచార్జీ సుష్మారెడ్డి , అసెంబ్లీ జాయింట్ కన్వీనర్ సుమన్ కుమార్, భైంసా పట్టణ అధ్యక్షులు ఎనుపోతుల మల్లేశ్వర్, మాజీ ఎంపీపీ అబ్దుల్ రజాక్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

నిర్మల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా : ఎమ్మెల్యే



సారంగాపూర్, అక్టోబరు 22 : నిర్మల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని జామ్ నుంచి బోరిగాం తండా వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేసి ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నిర్మల్ నియోజకవర్గంలో అన్ని గ్రామాలకు బీటీరోడ్ల నిర్మాణం కోసం ఆర్ఎన్‌బీ పంచాయతీరాజ్ శాఖ నుంచి నిధులను మంజూరు చేయించానని పేర్కొన్నారు. నియోజకవర్గం అభివృద్ధే తమ ధ్యేయమని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. అలాగే జామ్ నుండి బోరిగాం తండా బీటీ రోడ్డు నిర్మాణం కోసం రూ. 3 కోట్ల 20 లక్షలను మంజూరు చేయించడం జరిగిందన్నారు. దీంతో తండా వాసులకు ఇతర గ్రామాలకు రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు తొలగి పోతాయన్నారు. అలాగే ఆలూర్‌లో సొసైటీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్, ఇరిగేషన్ ఈఈ అశోక్, పంచాయతీ డీఈ తుకారాం, మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ హాది, సొసైటీ చైర్మన్ మాణిక్‌రెడ్డి, నాయకులు సత్యనారాయణ గౌడ్, రావుల రాంనాథ్, కరిపే విలాస్ నాయకులు, అధికారులు ఉన్నారు.

రైతుబంధు నిధులు వెంటనే జమ చేయండి

నిర్మల్ కల్చరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీలో భాగంగా రైతుబంధు, రుణమాఫీ పూర్తి స్థాయిలో అమలు చేయాలని రాజ్యాంగ పరిరక్షణ వేదిక రాష్ట్ర కార్యదర్శి నూనె శ్రీనివాస్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రకృతి వైపరీత్యం, అకాల వర్షాలతో రైతులు పంటలు పూర్తిగా నష్టపోయి ఇబ్బందుల్లో ఉన్నా రని ఆవేదన వ్యక్తం చేశారు.

కోతుల దాడిలో మృతి చెందిన

లక్ష్మి కుటుంబానికి అండగా నిలవాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అఖిల పక్షం నాయకులు

ఖానాపూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఖానాపూర్ విద్యానగర్‌లో కోతులు వెంబడించడంతో కిందపడి మృతి చెందిన బొంగోని లక్ష్మీ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని అఖిలపక్షం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం, మున్సిపల్ కార్యాలయాల్లో వినతిపత్రం అందజేశారు. అనంతరం అఖిల పక్షం నాయకులు వీడీసీ అధ్యక్షులు బీసీ రాజన్న, నంది రామయ్య, కొత్తపెల్లి సురేష్, కొండాడి గంగారావు, సంజీవరావు, తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా పట్టణంలో కోతుల బెడద, కుక్కల బెడద తీవ్రంగా ఉన్నప్పటికీ అటు అటవీశాఖ అధికారులు కానీ ఇటు మున్సిపల్ శాఖ అధికారులు కానీ పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అఖిల పక్షం నాయకులు అనిల్ రావు, బీరయ్య, సంగ్రి రాజన్న, తదితరులున్నారు.

సమాజ రక్షణలో

పోలీసుల పాత్ర అత్యంత కీలకం


ఖానాపూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : సమాజ రక్షణలో పోలీసుల పాత్ర అత్యంత కీలకమని ఖానాపూర్ సీఐ సైదారావు అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఖానాపూర్ పోలీసులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఓపెన్ హౌస్ కార్యక్రమంలో సీఐ సైదారావు మాట్లాడారు. ఈ సందర్భంగా పట్టణంలోని మూడు ప్రైవేట్ పాఠశాలలతో పాటు ఓ ప్రభుత్వ పాఠశాలకు చెందిన సుమారు 1000 మంది విద్యార్థులతో బృందాల వారీగా ఉదయం నుండి సాయంత్రం వరకు నిర్వహించిన కార్యక్రమంలో సీఐ విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. పోలీసులు ఉపయోగించే ఆయుధాలు వాటి పనితీరు, పోలీస్ స్టేషన్ నిర్వహణ, కేసు నమోదు ప్రక్రియ తదితర రికార్డు పుస్తకాలను చూపుతూ విద్యార్థులకు స్పష్టంగా అవగాహన కల్పించారు. విద్యార్థులు సీఐ సైదారావును పలు ప్రశ్నలు అడగగా ఆయన వారికి ఉత్సాహంగా సమాధానమిస్తూ వారి అనుమానాలను నివృత్తి చేశారు. ఉదయం నుండి సాయంత్రం వరకు నిర్వహించిన ఈ ఓపెన్ హౌస్ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించడం మరువలేని అనుభూతిగా సీఐ అభివర్ణించాడు. భవిష్యత్తులో పోలీసు ఉద్యోగం వైపు పలువురు విద్యార్థులు ఆసక్తి కనబరిచేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. విధి నిర్వహణలో భాగంగా అమరులైన పోలీసు అమరవీరుల త్యాగాల గురించి సైతం విద్యార్థులకు వివరించినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సై రాహుల్, సహా పలువురు ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భక్తి

అడవితల్లి ఒడిలో
మొదలైన దండారీ సందడి

- దండారీ వేడుకలకు సిద్ధమవుతున్న ఆదివాసీలు
- ఆటపాటలతో మారు మోగనున్న ఆదివాసీ గూడాలు
- గుస్సాడీ నృత్యాలు, హాస్య నాటికలతో ప్రతీ రాత్రి వినోదం
- సంస్కృతీ సంప్రదాయాలకు నిలయాలు.. ఆదివాసీ గూడాలు
- భక్తిశ్రద్ధలతో ఆరాధ్య దేవతకు ప్రత్యేక పూజలు
- అతిథులకు ఆహ్వానం.. విందులు


పద్మల్‌పురికాకో దేవతకు ప్రత్యేక పూజలు చేస్తున్న గుస్సాడీలు


నెమలి ఈకలతో టోపీల తయారీలో ఆదివాసీలు


పోరీల వేషధారణలో ఉన్న ఆదివాసీ యువకులు(ఫైల్)


నృత్యం చేస్తున్న గుస్సాడీలు(ఫైల్)


ఏత్మాసూర్ దేవతకు నైవేద్యం, దీపారాధన నిమిత్తం నువ్వుల నూనె తయారీలో నిమగ్నమైన ఆదివాసీలు

సిరికొండ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ గూడాల్లో ప్రతీయేటా అంగరంగ వైభవంగా జరుపుకునే దండారీ పండుగ సందడి మొదలైంది. డప్పుల దరువులు, గజ్జెల మోతలు, గుస్సాడీ నృత్యాలతో అడవితల్లి మురిసిపోనుంది. "దండారీ" అంటేనే ఆదివాసీ గూడాల్లో పదిరోజులపాటు జరుపుకునే ఓ వినోదాల వేడుక. ఏటా ఆదివాసులు అత్యంత భక్తిశ్రద్ధలతో కొలిచే ఆరాధ్య దేవత "ఏత్మాసూర్ పేన్" పేరిట చేసే ప్రత్యేక పండగతో మొదలవుతుంది. దీపావళికి ముందు భోగి పండగతో ప్రారంభమయ్యే ఈ వేడుక కొలబోడితో ముగుస్తుంది. ఆదివాసీ గూడాల్లో అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే ఈ దండారీ పండుగ ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందింది. అశ్వయుజ పౌర్ణమీ అనంతరం వారం పది రోజులపాటు సాగే ఈ వేడుక తరతరాల నుంచి వస్తున్న వారి ఆచార సంప్రదాయాలను కొనసాగించే అతి ముఖ్యమైన పండుగ ఇది. ఈ పండుగలో ఆదివాసీల కట్టుబొట్టు ఎంత అద్భుతంగా ఉంటుందో.. పండగ వేళ చేపట్టే దీక్ష కూడా అంత్యంత కఠినంగా ఉంటుంది. రాష్ట్రప్రభుత్వం దీన్ని ప్రత్యేక పండగగా గుర్తించింది. గత ప్రభుత్వం ఉత్సవాల నిర్వహణ కోసం దండారీలకు ప్రతీ యేటా ఆర్థిక సహాయం కూడా అందిస్తూ వచ్చింది. ఈ సారీ నిర్వహించే దండారీ ఉత్సవాలకు నిధులు విడుదల చేస్తుందో లేదో వేచి చూడాల్సిందే.

● సంస్కృతి, సంప్రదాయాలకు నిలయాలు..

తరతరాల నుంచి వస్తున్న తమ ఆచార సంప్రదాయాలను భావితరాలకు అందించేలా ఆదివాసీ పెద్దలు గూడేల్లో వాటిని కొనసాగిస్తూ వస్తున్నారు. గోండిపాటలతో గుస్సాడీ నృత్యాలు, కోలాటాలు, హాస్యనాటికల ప్రదర్శనలతో, అత్యంత భక్తిశ్రద్ధలతో తమ ఆరాధ్య దేవతలను పూజించే సంస్కృతీ సంప్రదాయాల పుట్టినిళ్లుగా ఆదివాసీ గూడాలన్ని విరాజిల్లుతున్నాయి. దండారీ సంబురాలను చూసేందుకు పల్లె ప్రజలతోపాటు పట్టణవాసులు సైతం ఆసక్తిగా తిలకిస్తారు. దాదాపు వారం, పదిరోజులపాటు జరుపుకునే దండారి పండుగను గూడాల్లో అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఆదివాసీలు సిద్ధమవుతున్నారు. భోగి పండుగతో మాలధారణ వేసినప్పటి నుంచి వారు దీక్షలో కొనసాగుతారు. దీక్ష చేపట్టిన నాటి నుంచి పూర్తయ్యే వరకు స్నానాలు ఆచరించకుండా, కాళ్ళకు పాద రక్షలు ధరించకుండా, చలిలో అర్థ దుస్తులు ధరించి, మంచం, కుర్చీలలో కాకుండా నేల పైననే కూర్చోవడం, నిద్రించడం వారి ఆచారం.

● గుస్సాడీలది విచిత్ర వేషధారణ

దండారీ వేడుకల్లో గుస్సాడీలు (గురు) కీలక పాత్ర పోషిస్తారు. నెత్తిన నెమలి పింఛం, ఆ పింఛానికి ఇరువైపులా దుప్పి కొమ్ములు.. పింఛం మధ్యలో తలుక్కున మెరిసే అద్దం, భు జానికి జింక తోలు, నడుము, కాళ్ళకు గళ్లు గళ్లున మోగే గజ్జెలు, మెడలో శివయ్య రుద్రాక్ష మాల.. ఒంటినిండా బూడిద..ముఖానికి నల్లని రంగు, ఇలా విచిత్ర వేషధారణతో కనిపించే వీరిని గుస్సాడీకి బదులుగా 'గురు' అని పిలుస్తారు. "గురు" అనగా ఆదివాసీల దేవుని ప్రతిరూపంగా భావిస్తారు. గుస్సాడీల్లో "పోరీ"లది మరో ప్రత్యేక పాత్ర. ఆడ వేషధారణలో ఉండే యువకులను ఆదివాసీలు "పోరీలు" అని పిలుస్తారు. ఏ ఊరికి వెళ్లినా ఏ ఇంటికి సందర్శించిన ఈ పోరీలు మంగళ హారతులతో అష్ట ఐశ్వర్యాలు కలగాలని, కుటుంబ సభ్యులందరూ సుఖశాంతులతో జీవించాలని దీవిస్తారు.

● ఐకమత్యానికి నిదర్శనం..

దండారీ పండుగ అంటేనే ఐకమత్యానికి నిదర్శనం. ఈ పండుగ వేళ ఆదివా సీ గ్రామాల ప్రజలు ఒక ఊరి నుంచి దండారీ బృందంతో మరో ఊరికి బయ ల్దేరి వెళ్తారు. ఇలా ఈ దండారీ బృందం ఏ గ్రామానికి వెళ్లాలన్నా రాత్రిపూటనే వెళ్లడం ఆనవాయితీగా వస్తోంది. అలా వెళ్లడం ద్వారా రెండు గ్రామాల మధ్య సత్సంబంధాలు ఏర్పడుతాయని వారి భావన. రాత్రంతా నృత్యాలు, గోండి పాటలపై డ్యాన్సులు, హస్యనాటికలతో ప్రదర్శనలు ఇస్తూ ప్రేక్షకులకు వినోదాన్ని అందిస్తారు. ఈ గుస్సాడీలు తెల్ల వారగానే కాలకృత్యాలు తీర్చుకుని ఉదయం మాన్‌కోలాతో నృత్య ప్రదర్శన లు మొదలు పెట్టి.. సార్‌కోలాతో ముగిస్తారు. ఈసందర్భంగా వచ్చిన అతిథులకు ఘనస్వాగతం పలికి, మరుసటి రోజున ప్రత్యేక విందును ఏర్పాటు చేసి వీడ్కోలు పలుకుతారు. దీంతో ఇరువైపులా స్నేహభావం పెంపొందడంతో పాటు సంస్కృతీ, సంప్రదాయాల పరిరక్షణకు తోడ్పడుతోంది అని వారి ప్రగాఢ విశ్వాసం.


ఆరాధ్య దేవతకు పూజలు చేస్తున్న గుస్సాడీలు (ఫైల్)

● పద్మల్‌పురికాకో దేవత ప్రధానమైంది

దండారి పండగ వేళ ఆదివాసీలు తమ ఆరాధ్యదేవతగా పిలిచే "పద్మల్ పురికాకో" ప్రధానమైంది. ఈ పండుగలో "ఏత్మాసూర్ పేన్" పేరిట నాల్గు సగ(గోత్రం)లలో ఉత్సవాలు జరుపుకుంటారు. నాల్గు సగల వారు గుమ్మెల, 5 సగల వారు ఫర్రా, 6 సగల వారు కోడల్, 7 సగల వారు తపల్ పేరిట ఉత్సవాలు నిర్వహిస్తారు. ఇదిలా ఉండగా కోలాట, మహిళల బృందాలు వేర్వేరుగా ఉంటాయి. ఈ వేడుకల్లో ఛేటకోలా, మాన్‌కోలా, సదర్ కోలా, కోడల్‌కోలా, సార్‌కోలా, కలివల్‌కోలా వంటి అనేక రకాల నృత్యాలు చేయడం ఆదివాసీలకే సొంతం. పేర్లు ఎంత వైవిధ్యంగా ఉన్నాయో..వారి ఆటపాటలు కూడా అంతే వైవిధ్యంగా కొనసాగుతాయి.

● కొలబొడితో వేడుకలు ముగింపు

వారం పాటు వైభవంగా ఉత్సవాలు జరుపుకున్న తర్వాత దీపావళి మరుసటిరోజు కొలబొడితో వేడుకలు ముగిస్తారు. కార్యక్రమాలు, అతిథుల రాకపోకలు పూర్తికాగానే గ్రామంలోని దండారి బృందం ఇంటింటికీ వెళ్లి దర్శనమిస్తారు. దీంతో ఇంటి గృహిణి ఓ పల్లెంలో ధాన్యాలు, తోచిన నగదు ఉంచిన హారతిని వారికి అందిస్తారు. దీన్ని వారు సంతోషంగా స్వీకరించి అందరూ బాగుండాలని, పాడి పంటలు సమృద్ధిగా పెంపొందాలని ఇంటింటికీ వెళ్లి పాటలు పాడుతూ హారతి పూజచేసి కార్యక్రమాన్ని ముగిస్తారు.

ఫోటో న్యూస్


జోడేఘాట్‌లోని స్మృతి వనం


జోడేఘాట్‌లోని కొమురంభీం స్మృతి వనం


జోడేఘాట్ గ్రామం

పోరాట పల్లెలు.. అందాల ముల్లెలు!

ఆ పల్లెలు ఒకప్పుడు జల్ జంగల్ జమీన్ కోసం నిజాం నిరంకుశత్వంపై పోరు సల్పినవి. మాన్యం వీరుడు కుమురంభీం చేపట్టిన పోరకాటానికి వెన్నుదన్నుగా నిలిచిన ఆ పల్లెలు నేడు ప్రకృతి అందాలను సంతరించుకున్నాయి. చట్టూ దట్టమైన అడవుల మధ్య ఆహ్లాదకర వాతావరణంలో అలరారుతున్నాయి. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో కుమురంభీం నేలకొరిగిన జోడేఘాట్‌కు చుట్టుపక్కల పోరు గ్రామాలుగా పిలిచే దోబ్రాగూడ, టోకెన్‌మావడ్, బాబేఝరి, పిట్టగూడ, పెద్దపాట్నాపూర్, చిన్న పాట్నాపూర్, మావాజ్ గూడ గ్రామాల అందాల చిత్రాలివి.

● (ఆంధ్రజ్యోతి, ఆదిలాబాద్ స్టాఫ్ ఫొటోగ్రాఫర్)


ఘాట్ రోడ్డు


మంచుతో కప్పబడిన జోడేఘాట్ పరిసరాలు


కచ్రాల బండిపై జోడేఘాట్‌కు వస్తున్న ఆదివాసీలు


మ్యూజియంలో ఏర్పాటు చేసిన గుస్సాడి నృత్య వేషధారణ ప్రతిమలు


పొన్నారి పాఠశాలలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఎంపీ

ఉపాధ్యాయుడిగా మారిన ఎంపీ!!

తాంసి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ ఎంపీ జి.నగేష్ ఉపాధ్యాయుడిగా మారారు. మంగళవారం తాంసి మండలంలో పర్యటించిన ఆయన పలు పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలి ంచారు. పాఠశాల గదిలోకి వెళ్లి విద్యార్థులను ప్రశ్నలను అడిగి తెలుసుకున్నారు. స్వయంగా పాఠాలు బోధించారు. దీంతో విద్యార్థిని విద్యార్థులు ఎంపీతో సెల్ఫీ ఫొటోలను దిగారు.

జర దేఖో!!



ఇచ్చోడలో ట్రాఫిక్.. ట్రాఫిక్!

● రోడ్డు విస్తరణ పనులతో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

ఇచ్చోడ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఓ వైపు రోడ్డు విస్తరణ నిర్మాణ పనులు.. మరోవైపు సోమవారం అంగడి కారణంగా ఇచ్చోడలోని ప్రధానకూడళ్ల శివాజీచౌక్, అంబేద్కర్ చౌక్, కొమురంభీం చౌక్, సిరిచెల్మ చౌక్‌ల వద్ద ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి. విస్తరణ పనుల్లో భాగం గా రోడ్డుకు ఒకవైపు కంకర వేయడంతో గత వారం రోజులుగా ఇబ్బం దులు పడుతున్నారు. ఒకవైపు కంకర వేయడంతో ఒకేవైపు మాత్రమే వాహనదారులు రాక పోకలను సాగించాల్సిన పరిస్థితి. సోమవారం వారసంత కావడంతో అక్కడే పండ్లు, కూరగాయాలు, చిరు వ్యాపారుల దుకాణాలు ఏర్పాటు చేయడంతో వాహనదా రుల ఇబ్బందులు వర్ణణాతీతం. విస్తరణ పనులు కొనసాగుతుండడంతో దారంతా దుమ్ము, ధూళితో నిండిపోతుంది. పాదాచారులు ఆ రోడ్డు గుండా వెళ్లాలంటే ముక్కు మూసుకో వాల్సిందే. ద్విచక్రవాహనదారుల కళ్లలో మట్టి రేణువులు పడుతున్నాయి. దుమ్ముకు ఎదురుగా వచ్చే వాహనాలను కనిపించే పరిస్థితి లేకుండా పోతోంది. ఈదారి గుండా నిత్యం ప్రయాణించే ప్రజలు దుమ్ము రేణువుల్లో ఉం డే బ్యాక్టీరియా, వ్యాధికారక సూక్ష్మ జీవులు ఊపిరితిత్తుల్లోకి వెళ్తే శ్వాసకోశ, చర్మ వ్యాధులు వచ్చే అవకాశముందని వైద్యులు పేర్కొం టున్నారు. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. హోటళ్లు, బేకరీలు, తేనీటి దుకాణాల వ్యాపారులు దమ్ము కారణంగా ఇబ్బందులు ఎదు ర్కొంటున్నామని చెబుతున్నారు. ఇకనైనా సంబంధిత గుత్తేదారు, సంబంధిత శాఖ జిల్లా ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు చేసుకోవాలి: తహసీల్దార్

పెంబి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గ్రాడ్యుయేట్స్ ఓటరు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ దుర్వ లక్ష్మణ్ అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు కోసం ఫారం-18లో దరఖాస్తు చేసుకోవాలని, 31 అక్టోబరు 2021 నాటికి ఉత్తీర్ణత సాధించి, 1 నవంబరు 2024 నాటికి డిగ్రీ పూర్తయి 3 సంవత్సరాలు కావాలని తెలిపారు. అర్హులైన ఉపాధ్యాయులు, అధ్యాపకులందరూ ఓటరుగా నమోదు కోసం తాజాగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మణ్, లచ్చిరాం, రాజం, శ్రావణ్ కుమార్ రెడ్డి, శత్రుగన్, తదితరులున్నారు.

క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలి

ఆదిలాబాద్ రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): బ్రెస్ట్ క్యాన్సర్‌పై ఆదిలాబాద్ పట్టణంలో వైద్యులు, వైద్య విద్యార్థులు మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. రిమ్స్ నుంచి ప్రారంభమైన ర్యాలీ స్టేడియం వరకు సాగింది. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో కృష్ణ, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ మాట్లాడుతూ మహిళలు బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. మహిళలు రొమ్ము క్యాన్సర్ పరీక్షలను చేయించుకోవాలన్నారు. ప్రతీఒక్కరు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, వైద్య విద్యార్థులు, పట్టణవాసులు పాల్గొన్నారు.

గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

సిరికొండ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థులను స్వతంత్ర పాఠకులుగా తీర్చిదిద్దేందుకు రూమ్ టు రీడ్ ఇండియా ట్రస్ట్ యూఎస్ఏఐడీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని డీఈవో ప్రణీత అన్నారు. మంగళవారం సిరికొండ మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో రూమ్ టు రీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ఆమె ఎంఈవో సునీల్, ప్రధానోపాధ్యాయుడు గంగారాం, ఏఎంవో శ్రీకాంత్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లో పఠన సామర్థ్యాలను పెంపొందించడానికి సంస్థ కృషి చేస్తోందని అన్నారు. ఇందులో భాగంగా సిరికొండలోని ఎంపీపీఎస్ పాఠశాలలో ఓ గదిని గ్రంథాలయానికి కేటాయించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో రూమ్ టు రీడ్ స్వచ్ఛంద సంస్థ జిల్లా ఇన్‌చార్జీ శ్రీకాంత్, మండల కో ఆర్డీనేటర్‌లు విజయ్, ఉదయశ్రీ, తదితరులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న ఆదివాసీ గిరిజనులు

గుస్సాడి ఉత్సవాలు ప్రారంభం

నేరడిగొండ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగట్ల గోండగూడ గ్రామంలో పటేల్ ఇంటి వద్ద గల గుస్సాడి విగ్రహ జెండా వద్ద గుస్సాడి సామగ్రిని ఉంచి నైవేద్యాలను పెట్టి బోగి నిర్వహించి దీపావళి వేడుకను ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామపటేల్ ఆశేరావ్, పూజారి మడావి, ఆనంద్‌రావు, పెందూర్ భీంరావ్, సిడాం సంతోష్, పెందూర్ లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు నివారణ టీకాలను సద్వినియోగం చేసుకోవాలి

నేరడిగొండ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను సద్విని యోగం చేసుకోవలని పశువైద్యాధికారి రాథోడ్ జీవన్ అన్నారు. జిల్లా పశు సంవర్ధక శాఖ, ఎన్‌ఏడీసీపీ వారి ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ పశు వ్యాధి నిరోధక టీకాలు, సామూహిక గాలికుంటు వ్యాధి నిరోధక కార్యక్రమంలో భాగంగా మండలంలోని వడూర్ గ్రామంలో 796 పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల పశు పోషకులు జాగ్రత్త పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది వెంకన్న, నరేందర్, సురేష్, శివప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

పొచ్చెర జలపాతం వద్ద మహిళా శక్తి క్యాంటీన్ ఏర్పాటు

బోథ్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని పొచ్చెర జలపాతం వద్ద ఇందిరా క్రాంతి మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మహిళా శక్తి క్యాంటీన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు డీఆర్డీవో పీడీ సాయన్న పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పొచ్చెర జలపాతం వద్ద నూతనంగా ప్రారంభించనున్న క్యాంటీన్ ఏర్పాట్లపై మహిళా సంఘాల ప్రతినిధులతో మాట్లాడారు. అనంతరం నూతనంగా ప్రారంభించనున్న హోటల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల వారికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట డీపీవో గంగన్న, ఏపీవో మాధవ్‌లతో పాటు స్వశక్తి మహిళా సంఘాల అధ్యక్షులు, సీసీలు ఉన్నారు.

నేడు స్వశక్తి క్యాంటీన్ ప్రాంభం

భోథ్(ఆంధ్రజ్యోతి): మండలంలోని పొచ్చెర జలపాతం వద్ద మహిళా సంఘాల ఆధ్వర్యంలో మహిళా శక్తి క్యాంటీన్ ఏర్పాటు చేయనున్నారు. అయితే క్యాంటీన్ ప్రారంభోత్సవానికి బుధవారం 23న స్థానిక ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌తో పాటు జిల్లా కలెక్టర్‌తో పాటు ఇతర అధికారులు కార్యక్రమానికి హాజరు కానున్నారు.

నేడు పోలీసుల టూ కే రన్

బోథ్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల వారోత్సవాలలో భాగంగా నేటి ఉదయం బుధవారం 5.45 నిమిషాలకు బోథ్ బస్టాండ్ నుంచి 2 కే రన్ నిర్వహించినట్లు బోథ్ ఎస్ఐ ఎల్.ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు గాను యువకులు ఐదున్నర గంటలకు బోథ్ బస్టాండ్‌కు చేరుకోవాలని ఆయన కోరారు.

వజ్జర్ అడవుల్లో పులి సంచారం

భోథ్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని వజ్జర్ అడవుల్లో పెద్దపులి సంచరిస్తున్నట్లు తెలిసింది. మంగళవారం అటవీ శాఖ అధికారులు మధ్యాహ్నం వజ్జర్ అడవుల్లోకి వెళ్లగా సమీపంలోని గుట్టల వద్ద పెద్దపులిని చూసినట్లు తెలిసింది. అటవీ శాఖ అధికారులతో పాటు కొంత మంది గ్రామస్థులు సైతం పులిని చూసి అక్కడ నుంచి వెను తిరిగి వచ్చినట్లు తెఇసింది. అయితే ఈ విషయమై అటవీ శాఖ అధికారులను వివరణ కోరగా.. పులి సంచరిస్తున్న మాట వాస్తమేనని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు.

పెండింగ్ బిల్లుల కోసం నిరసన

ఉట్నూర్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పెండింగ్ బిల్లుల కోసం దశల వారీ ఉద్యమ కార్యచరణలో భాగంగా నల్ల బ్యాడ్జీలతో ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. టీపీయూస్ జిల్లా మీడియా కన్వీనర్ రాథోడ్ ఉపేందర్ ఆధ్వర్యంలో పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల బిల్లులు డీఏలు పీఆర్సీ ప్రకటన గురించి తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ర్ట శాఖ పిలుపు మేరకు నాలుగు దశల పోరాటంలో భాగంగా మంగళవారం ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలతో నిరసన, 28న తహసీల్దార్‌లకు వినతిపత్రాలు, నవంబరు 5న జిల్లా కలెక్టరేట్ ముందు ధర్నా, నవంబర్ 23న హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద ధర్మాగ్రహ దీక్ష చేపడతామని తపస్ జిల్లా మీడియా కన్వీనర్ రాథోడ్ ఉపేందర్ తెలిపారు.



● గుడిహత్నూర్‌లో తవ్వకాలు చేపట్టిన కంకర క్వారీ

కంకర క్వారీలను.. మింగేస్తున్నారు!

- జిల్లాలో రెచ్చిపోతున్న మైనింగ్ మాఫియా
- అనుమతులు గోరంత.. తవ్వకాలు కొండంత
- అక్రమంగా తవ్వకాలు జరిపారంటూ ఈటీఎస్ సర్వేతో నిర్ధారణ
- రూ.49.61 కోట్ల పెనాల్టీ విధించి నోటీసులతోనే సరి
- మైనింగ్ మాఫియాపై చర్యలకు వెనుకాడుతున్న అధికారులు

రోజురోజుకూ.. జిల్లాలో మైనింగ్ మాఫియా రెచ్చిపోతున్నా.. అధికారులు పట్టించుకోకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కంకర క్వారీల పేరిట అడ్డగోలుగా తవ్వకాలు చేపడుతూ జేబులు నింపుకోవడం పరిపాటిగా మారింది. జిల్లావ్యాప్తంగా మొత్తం 16 స్టోన్ క్రషర్స్ ఉండగా.. మేజర్ మినరల్స్ ఏడు, ఒకటి లైమ్‌స్టోన్ క్వారీలు ఉన్నాయి. అయితే, ఇందులో సగానికి పైగా క్వారీలు అక్రమ తవ్వకాలు చేపట్టడం గమనార్హం. అంతేకాకుండా తలమడుగు మండలం సుంకిడి వద్ద మరో కొత్త క్వారీ ఏర్పాటుకు ఇటీవల మైనింగ్ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. నిబంధలను గాలికి వదిలేస్తున్న క్వారీల తవ్వకాలు, అమ్మకాలపై నిఘాను సారించాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తియినా చూడకపోవడం విడ్డూరం. మూడు నెలలకోసారి సర్వేను చేపట్టాల్సి ఉండగా.. నామమాత్రపు చర్యలతో మమ అనిపించేస్తున్నారు. దీంతో ప్రభుత్వానికి అనుకున్నంత స్థాయిలో ఆదాయం రాకపోగా.. భారీ మొత్తంలో గండిపడుతోంది.

ఆదిలాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కంకర క్వారీల పేరిట మైనింగ్ మాఫీయా మరింతగా రెచ్చిపోతోంది. అడిగేవారే లేరన్నట్లుగా అడ్డగోలుగా తవ్వకాలు చేపడుతూ అందినకాడికి దండుకుంటున్నారు. ఏదో అడపదడపా తనిఖీలు చేపడుతున్నా.. అధికారులు అక్రమతవ్వకాలకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలో 16 స్టోన్ క్రషర్స్ ఉండగా.. మేజర్ మినరల్స్ ఏడు, ఒకటి లైమ్‌స్టోన్ క్వారీలు ఉన్నాయి. ఇటీవల కొత్తగా తలమడుగు మండలం సుంకిడి గ్రామ పరిసర ప్రాంతాల్లో మరో క్వారీని ఏర్పాటు చేసేందుకు మైనింగ్ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. దాదాపుగా ఇందులో సగానికి పైగా క్వారీలు అక్రమంగా తవ్వకాలు చేపడుతున్నట్లు అధికారులు గుర్తించారు. జిల్లాలో ముఖ్యంగా ఇచ్చోడ, గుడిహత్నూర్, తలమడుగు, బజార్‌హత్నూర్, ఆదిలాబాద్ రూరల్, జైనథ్ మండలాల్లో కంకర, మేజర్ మినరల్స్, లైమ్ స్టోన్ క్వారీలు ఉన్నాయి. వీటి పరిధి లో యేటా కోట్ల రూపాయల విలువైన కంకర తవ్వకాలను చేపడుతున్నారు. కానీ, ప్రభుత్వానికి అంతంత మాత్రంగానే ఆదాయం వస్తోంది. ఎందుకంటే అధికారుల సరైన పర్యవేక్షణ లేకపోవడంతో క్వారీల నిర్వాహకులు అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. అంతేకాకుండా గోరంతగా అనుమతులు తీసుకుని.. కొండలను తవ్వేస్తూ పిండి చేస్తున్నా.. అధికార యంత్రాంగం చోద్యం చూడడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

నామమాత్రంగానే సర్వే

మైనింగ్ క్వారీలపై ప్రతీ మూడు నెలలకోసారి ఈటీఎస్ సర్వేను చేపట్టి అక్రమాలను గుర్తించాల్సిన అధికారులు నామమాత్రంగానే అడపదడపా సర్వే చేపడుతున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఏదైనా ఫిర్యాదు వస్తే తప్ప క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కనిపించడం లేదంటున్నారు. పలు మండలాల్లో కంకర క్వారీలు ప్రమాదకరంగా మారి ప్రాణాలను మింగేస్తున్నా.. పట్టింపే లేకుండా పోయిందంటున్నారు. క్వారీ యజమానులు నిబంధనలు గాలికి వదిలేస్తున్నా.. చర్యలు చేపట్టేందుకు అధికారులు వెనుకాడడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిరంతరంగా క్వారీల తవ్వకాలు, అమ్మకాలపై నిఘాను సారించాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తియినా.. చూడడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. కానీ అడపదడపా సర్వేను చేపడుతూ చేతులు దులుపుకుంటున్నారన్న విమర్శలు లేకపోలేదు. మొదటి నుంచి మైనింగ్ శాఖ అధికారుల తీరుపై పలు ఆరోపణలు వస్తున్నా.. పనితీరులో మాత్రం మార్పు కనిపించడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి.

ఏడు క్వారీలకు నోటీసులు

ఈయేడు జనవరిలో ఈటీఎస్ సర్వేను చేపట్టిన అధికారులు జిల్లాలో ఏడు క్వారీలు నిబంధనలకు విరుద్ధంగా అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించారు. దీంతో సంబంధిత క్వారీ యజమానులకు ఇటీవలే నోటీసులను జారీ చేశారు. మొత్తం రూ.49.61 కోట్ల విలువైన ఖనిజ సంపదను అక్రమంగా తవ్వే సుకున్నట్లు అధికారులు నిర్ధారించారు. దీంతో క్వారీ హద్దుల బయట తవ్వకాలు చేపట్టిన వారికి 1+10 శాతం, క్వారీ లోపల అనుమతుల కంటే అధికంగా తవ్వకాలు చేపడితే 1+5 శాతం అధికంగా పెనాల్టీని విధించారు. ఇచ్చోడ మండలం రాజశేఖర్‌రెడ్డి స్టోన్‌క్రషర్‌కు రూ.17.46కోట్ల పెనాల్టీ, బజార్‌హత్నూర్ మండలం చింతల్‌సాంగ్వి బీరాకైలాస్ స్టోన్ క్రషర్‌కు

మిగతా 6వ పేజీలో...

విద్యా ప్రమాణాలు మెరుగుపర్చాలి

- ఉపాధ్యాయులకు జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఆదేశం
- సిరికొండ మండలంలో పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు

సిరికొండ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అర్థవంతంగా బోధించి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపర్చేందుకు కృషి చేయాలని కలెక్టర్ రాజర్షిషా ఉపాధ్యాయులను ఆదేశించారు. సిరికొండ మండలంలో కలెక్టర్ మంగళవారం సుంకిడి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, సిరికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలల్లో విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. సుంకిడి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందిస్తున్నారా..? సరుకులు సకాలంలో అందుతున్నాయని ప్రశ్నించారు. 3ఏళ్లలోపు పిల్లలందరికీ బాలామృతంతో పాటు మంచి పౌష్టికాహారం అందజేసి వారి ఎదుగుదలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని అన్నారు. బరువు తక్కువగా ఉన్న చిన్నారులపై ప్రత్యేకదృష్టి సారించాలని, కేంద్రంలో ఉన్న చిన్నారులలో శ్యామ్, మామ్ పిల్లలను గుర్తించి పౌష్టికాహారం అందించాలని, అంగన్వాడీ టీచర్‌కు ఎత్తు, బరువులపై అవగాహన ఉండాలని అన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు ఏడుస్తుంటే వారిని సముదాయిస్తూ చాక్లెట్స్ అందించారు. అనంతరం మండల పరిషత్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల పఠన, అభ్యసన సామర్థ్యాలను తెలుసుకునే ప్రయత్నం చేశారు. ప్రతీ విద్యార్థితో మాట్లాడుతూ.. వారికి చదవడం, రాయడంలో ఏమాత్రం నేర్చుకున్నారో పరిశీలించారు. ప్రతీ విద్యార్థి ప్రతీ సబ్జెక్ట్‌లో చక్కని ప్రావీణ్యం కలిగి ఉండడంతో కలెక్టర్ ఉపాధ్యాయులను అభినందించారు. గ్రామస్తులతో కలెక్టర్ మాట్లాడుతూ.. పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులకు మంచి బోధనను అందిస్తున్నారనీ తమ పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలకే పంపించాలని సూచించారు. సిరికొండలో ఇటీవల తల్లిదండ్రులను కోల్పోయి జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న మేఘన, రిత్విక్‌లకు మెరుగైన విద్య కోసం ఆదిలాబాద్, ఇచ్చోడలోని గురుకుల పాఠశాలలో చేర్పించాలని ఆర్సీవో, డీఈవో, ఎంఈవోలను ఆదేశించారు. అలాగే వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యేలా చూడాలని మండల అభివృద్ధి అధికారి రవీందర్‌కు సూచించారు. అనంతరం విద్యార్థుల హాజరు రిజిష్టరు, ఉపాధ్యాయుల హాజరు రిజిష్టర్లను పరిశీలించారు. పదవ తరగతి



సుంకిడి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల పఠన సామార్థ్యాన్ని పరీక్షిస్తున్న కలెక్టర్ రాజర్షిషా

విద్యార్థులతో కాసేపు ముచ్చటిస్తూ.. జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలంటే విద్యార్థులు ఒక లక్ష్యం నిర్దేశించుకుని ప్రణాళిక బద్ధంగా కష్టపడి బాగా చదవాలన్నారు. ఇందులో డీఈవో ప్రణీత, తహసీల్దార్ తుకారాం, ఎంపీడీవో రవీందర్, ఎంఈవో సునీల్, ఎంపీవో సంతోష్, ఏపీఎం సంతోష్, ఏపీవో భీంరావ్, ఆర్ఐ విలాస్, అంగన్వాడీ టీచర్‌లు, తదితరులు పాల్గొన్నారు.

● పొన్న గ్రామంలోని బ్రిడ్జి, రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి

మండలంలోని పొన్న గ్రామానికి వెళ్లే తారు రోడ్డు, బ్రిడ్జికి మరమ్మతులు చేపట్టాలని కోరుతూ మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాదవ్ పటేల్ గ్రామస్థులతో కలిసి కలెక్టర్ రాజార్షి షాకు వినతిపత్రం అందజేశారు. పొన్న గ్రామం సమీపంలో ఉన్న పురాతన బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకుని, భారీ వర్షాల వల్ల వరదలు వచ్చినప్పుడు సమీపంలోని ఇళ్లల్లో వరద నీరు వచ్చి చేరుతోందని ఆయన ఈ సందర్భంగా వివరించారు.

ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహం తనిఖీ

తలమడుగు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని 'బాలుర బీసీ సంక్షేమ శాఖ వసతి గృహంలో సమస్య తిష్ఠ' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి' జిల్లా పేజీలో మంగళవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. దీనిలో భాగంగా జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి కె.రాజలింగు సందర్శించి హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా బీసీ హాస్టల్‌లో ప్రహరీ, మరుగుదొడ్ల మరమ్మతులు, విద్యార్థులకు ఫిల్టర్ వాటర్ అందించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం హాస్టల్ విద్యార్థులకు ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. వసతి గృహ విద్యార్థులకు సమస్యలు ఏమైనా ఉన్నాయని ఆరా తీశారు. అదే విధంగా మెన ప్రకారం భోజనం, పౌష్టికాహారం అందించాలన్నారు. విద్యార్థులకు ఆరోగ్యంపై సూచనలు చేస్తూ పదవ తరగతి విద్యార్థులకు వంద శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ఎప్పటికప్పుడు పరీక్షలు రాస్తూ ఉదయం చదవడం నేర్చుకోవాలని తెలిపారు. ఇందులో వసతి వార్డెన్ నరసింహులు, సిబ్బంది, హెచ్‌డబ్ల్యూలు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



కూలిపోయిన ప్రహరీని పరిశీలిస్తున్న జిల్లా అధికారి

నేడు ద్విచక్ర వాహనాల వేలం

ఉట్నూర్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ మండల కేంద్రంలోని ప్రోహిబిషన్ ఎక్సైజ్‌స్టేషన్‌లో బుధవారం పట్టుబడిన ద్విచక్ర వాహనాల బహిరంగ వేలం నిర్వహిస్తున్నామని ఉ ట్నూర్ ఎక్సైజ్ కార్యాలయం హౌజ్ ఆఫీసర్ రూప్‌సింగ్ తెలిపారు. ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు ఉట్నూర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన ద్ర్వాబిడి ద్విచక్ర వాహనాలు వేలం వేయనున్నామని, ఆసక్తి ఉన్న వారు ఉదయం 11గంటలకు తమ కార్యాలయానికి చేరుకొని వాహనాల వేలంలో పాల్గొనేవారు రూ.5వేల డిపాజిట్ చెల్లించి బహిరంగ వేలంలో పాల్గొనాలన్నారు. మిగత వివరాల కోసం స్థానిక ఎక్సైజ్ స్టేషన్ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. కోరారు.

గూడెల్లో దండారి సందడి షురూ!

- వేడుకలకు సిద్ధమవుతున్న ఏజెన్సీ ప్రాంతంలోని ఆదివాసీలు
- భక్తిశ్రద్ధలతో ఆరాధ్య దేవతకు అడవిబిడ్డల ప్రత్యేక పూజలు



7

పెండల్‌వాడ గ్రామాన్ని సందర్శించిన ట్రైనీ కలెక్టర్లు

జైనథ్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెండల్‌వాడ గ్రామంలో మంగళవారం ట్రైనీ కలెక్టర్ బృందం సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో గల ఆత్మలింగ హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలను మండల అధికారులతో ఈ సందర్భంగా అడిగి తెలుసుకున్నారు. దీంతో పాటు మండలంలో గ్రామంలో రైతులు సాగు చేస్తున్న పత్తి, సోయాబీన్, కందితో పాటు తదతర పంటలను రైతులను అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా పెండల్‌వాడలో గల పల్లె దవఖానను సందర్శించి రోగులకు అందిస్తున్న సేవలను పరిశీలించి పెండల్‌వాడ చెరువును సందర్శించి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్లు సిమ్రాన్, కమురోద్దిన్, పవన్‌జ్యోత్‌కౌర్, మోహిద్‌రావత్, వెంకట్‌రావు చానినాథ్, వీడీసీ చైర్మన్ అల్లూరి నారాయణ రెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ జంగిలి నవనీతసురేష్, ఉప సర్పంచ్ నాగుల నరేష్, ఎంపీటీసీ కాసర్ల అశోక్, ఎంపీడీవో వెంకట్‌రాజ్, గ్రామ కార్యదర్శి గేడం సూరజ్, ఫీల్డ్ అసిస్టెంట్ జీవన్‌లతో పాటు పెండల్‌ఆడ ప్రజలు అధికారులు రైతులు పాల్గొన్నారు.